సాక్షి
జనగామ

గురువారం । 28 । నవంబర్ । 2024



నైపుణ్యం..ఉద్యోగ సోపానం

ప్రస్తుత రోజుల్లో చదువుతో పాటు ప్రత్యేక నైపుణ్యాలు చాటుకుంటున్న వారికే ఉద్యోగ అవకాశాలు వస్తున్నాయి.

- 8లో▸



ప్రజల ఆకాంక్షలు నెరవేర్చితేనే మనుగడ

ప్రజల ఆకాంక్షలు నెరవేర్చితేనే ప్రభుత్వాలకు మనుగడ ఉంటుందని రిటైర్డ్ ఆచార్యులు శ్రీనివాసులు అన్నారు.

- 8లో▸

గరిష్టం/కనిష్టం
$29^0/17^0$

వాతావరణం

ఉదయం నుంచి మంచుతోకూడిన చల్లని వాతావరణం ఉంటుంది. ఆకాశం మేఘావృతమై మధ్యాహ్నం ఉష్ణోగ్రతలు తగ్గుతాయి. రాత్రి సమయంలో చలి తీవ్రత మరింత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

ముగిసిన జీడికల్ బ్రహ్మోత్సవాలు



లింగాలఘణపురం: జీడికల్ శ్రీ వీరాచల రామ చంద్రస్వామి ఆలయంలో బుధవారం నిర్వహించిన శతఘటాభిషేకం, పండిత సన్మానంతో బ్రహ్మోత్సవాలు ముగిశాయి. ఈనెల 4న బ్రహ్మోత్సవాలు ప్రారంభం కాగా.. 20న సీతారాముల కల్యాణం, 21న రథోత్సవం, 26 చక్రస్నానం అనంతరం శతఘటాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మూర్తి, ఈఓ వంశీ, డైరెక్టర్లు, వెంకన్న, లక్ష్మి, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

నేడు 'డయల్ యువర్ డీఎం'

కాజీపేట అర్బన్ : టీజీఎస్ ఆర్టీసీ వరంగల్–1 డిపోలో ప్రయాణికుల సౌకర్యార్థం గురువారం ఉదయం 11 నుంచి 12 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ వంగల మోహన్‌రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్, నిజామాబాద్, సిద్దిపేట, పాలకుర్తి, తరిగొప్పుల రూట్లలో ప్రయాణించే వారు తమ సలహాలు, సూచనలను అందజేసేందుకు 99592 26047 నంబర్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.

డిసెంబర్ 1న జిల్లా స్థాయి కబడ్డీ ఎంపిక పోటీలు

రఘునాథపల్లి: కబడ్డీ విభాగంలో సీనియర్ మహిళా క్రీడాకారుల ఎంపిక పోటీలు డిసెంబర్ 1న నిడిగొండ జీపీ పరిధి సెయింట పీటర్ ఫౌండేషన్ హైస్కూల్ ఆవరణలో నిర్వహిస్తున్నట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు వై.కుమార్‌గౌడ్ తెలిపారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ జిల్లా స్థాయిలో ఎంపికైన వారు డిసెంబర్ 7 నుంచి 10వ తేదీ వరకు హైదరాబాద్ ఎల్‌బీ స్టేడియంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం ఉంటుందన్నారు. సెలక్షన్స్‌కు వచ్చే క్రీడాకారులు డిసెంబర్ ఒకటో తేదీ ఉదయం 9 గంటల వరకు రిపోర్టు చేయాలని, బరువు 75 కిలోల లోపు ఉండాలని సూచించారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి తోటకూరి గట్టయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆర్టీసీ డిపోలో 'వనభోజనాలు'

జనగామ రూరల్: కార్తీక మాసం సందర్భంగా గురువారం(నేడు) జనగామ ఆర్టీసీ డిపోలో 'వనభోజనాల' కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఉద్యోగ కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని డిపో మేనేజర్ ఎస్.స్వాతి ఒక ప్రకటనలో తెలిపారు. వనభోజనాల సందర్భంగా ఆటలు, పాటల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని, విజేతలకు బహుమతుల ప్రదానం ఉంటుందని పేర్కొన్నారు. అలాగే 2024 అక్టోబర్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు నగదు బహుమతులు అందజేస్తామన్నారు. ఆర్టీసీ అధికారులు, సూపర్‌వైజర్లు, ఉద్యోగులు కుటుంబ సభ్యులతో హాజరు కావాలని కోరారు.

నేడు గ్రంథాలయ చైర్మన్ ప్రమాణ స్వీకారం

జనగామ: జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా మారుజోడు రాంబాబు నేడు(గురువారం) ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఉదయం 11 గంటలకు ఎస్ఎంఆర్ గార్డెన్‌లో నిర్వహించే ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ రియాజ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్ రెడ్డి, పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని‌రెడ్డి హాజరు కానున్నారు.

సీటీ స్కాన్ సేవలు అందుబాటులోకి తేవాలి



జనగామ రూరల్: జిల్లా ఆస్పత్రిలో సీటీ స్కాన్ సేవలు అందుబాటులోకి తేవాలని కోరుతూ జనగామ పట్టణానికి చెందిన అమ్మ ఫౌండేషన్ ముఖ్య సలహాదారు వంగ భీమ్‌రాజు బుధవారం సీఎం రేవంత్‌రెడ్డికి ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని నిరుపేద ప్రజలు అత్యవసర సమయంలో పట్టణంలోని ఆస్పత్రికి వస్తే సీటీ స్కానింగ్ అందుబాటులో లేకపోవడంతో ప్రైవేటుకు రాస్తున్నారని చెప్పారు. ఈ సమస్యపై ఆరేళ్లుగా సామాజిక కార్యకర్తలు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తున్నారని పేర్కొన్నారు. మానవతా దృక్పథంతో సీటీ స్కాన్ సేవలు అందుబాటులోకి తేవాలని ఆయన కోరారు.

ఉడికీ ఉడకని భోజనం
నీళ్ల చారు.. పలుచని కూర

సాక్షి విజిట్


జఫర్‌గఢ్ : గుడిసెలో వంట చేస్తున్న కార్మికులు

- చెట్ల కింద, షెడ్లలోనే వంటా వార్పు
- 'పొగ'చూరుతున్న తరగతి గదులు
- అపరిశుభ్ర వాతావరణంలో భోజనం
- వంటకు, తాగడానికి బయటి నీరే..

జిల్లాలో సర్కారు స్కూళ్లు :	453
చదువుతున్న విద్యార్థులు :	30 వేలు
నెలకు మిడ్డేమీల్స్ ఖర్చు :	రూ. 38.29 లక్షలు

కిచెన్ షెడ్లు లేక చెట్లకింద, గుడిసెల్లోనే వంటావార్పు. గాలులతో ఉడికీ ఉడకని అన్నం.. నీళ్ల చారు.. పలుచని కూర.. మారు అడిగితే వడ్డించే పరిస్థితి లేదు.. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు మధ్యాహ్నం భోజనం అపరిశుభ్ర వాతావరణంలో నేలపై కూర్చుని తినాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. పేద విద్యార్థులకు పౌష్టికాహారం అందిస్తున్నామని ప్రభుత్వం చెప్పే మాటలకు.. క్షేత్రస్థాయిలో పరిస్థితులకు పొంతన లేకుండా పోయింది. మెనూను తుంగలో తొక్కి విద్యార్థుల కడుపు మాడ్చుతున్నారు. బుధవారం 'సాక్షి' విజిట్‌లో అనేక విషయాలు వెలుగులోకి వచ్చాయి. జిల్లాలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత, కేజీబీవీ, మోడల్ ఇతర పాఠశాలలు 453 ఉండగా.. వాటిలో 30 వేల మంది విద్యార్థుల వరకు చదువుతున్నారు. వీరికి రోజూ మధ్యాహ్న భోజనం వడ్డించేందుకు ప్రతి నెలా రూ.38.29లక్షల వరకు ప్రభుత్వం ఖర్చు చేస్తోంది. అయినా ఫలితం దక్కడంలేదు.

- జనగామ

గుడిసె కింద వంట

జఫర్‌గఢ్: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో కిచెన్ షెడ్ లేక గుడిసెలోనే వంట చేస్తున్నారు. పై కప్పు నుంచి బల్లులు, పురుగులు పడే ప్రమాదం ఉంది. డైనింగ్ హాల్ లేక 302 మంది విద్యార్థులు ఆరుబయట తినాల్సి వస్తున్నది. రెండు నెలలకు ఒకసారి మధ్యాహ్న భోజన బిల్లులు వస్తుండడంతో అప్పులు చేయాల్సి వస్తోందని వంట తయారు చేసే గ్రూపు సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు.

పాటించాల్సిన మెనూ

సోమవారం:	కిచిడీ, మిక్స్‌డ్ వెజిటబుల్ కర్రీ, గుడ్డు
మంగళవారం:	రాగిజావ, అన్నం, సాంబార్, మిక్స్‌డ్ వెజిటబుల్ కర్రీ
బుధవారం:	అన్నం, ఆకుకూర పప్పు, మిక్స్‌డ్ వెజిటబుల్ కర్రీ, గుడ్డు
గురువారం:	రాగిజావ, వెజిటబుల్ బిర్యానీ, మిక్స్‌డ్ వెజిటబుల్ కర్రీ
శుక్రవారం:	అన్నం, సాంబార్, మిక్స్‌డ్ వెజిటబుల్ కర్రీ, గుడ్డు
శనివారం:	రాగిజావ, అన్నం, ఆకుకూర పప్పు, మిక్స్‌డ్ వెజిటబుల్ కర్రీ



ఉడకని అన్నం.. నీళ్ల చారు

నర్మెట: మండల కేంద్రంలోని ఎస్టీ బాలికల ఆశ్రమ పాఠశాలలో ఉడికీ ఉడకని భోజనం, నీళ్ల చారు వడ్డిస్తున్నారు. అడుగున మాడిన అన్నం సైతం విద్యార్థులకు పెడుతున్నారు. పేరుకే కూర.. చూస్తే పలుచగా సాంబారును తలపించేలా ఉంది. అధికారుల పర్యవేక్షణ అసలే లేదు.

మారన్నం, కూర దొరకదు..

జనగామ రూరల్: జనగామ మండలం వడ్లకొండ జెడ్పీహెచ్ఎస్‌లోని విద్యార్థులకు అన్నం, కూర సరిపడా ఇవ్వడంలేదు. పలుచని చారుతోనే తినాల్సి వస్తోంది. పక్కనే ఉన్న ప్రాథమిక పాఠశాలలో నీళ్ల చారుతో భోజనం పెడుతున్నారు. గానుగుపహాడ్ హైస్కూల్‌లో మిగిలిన అన్నం డంపు చేస్తుండడంతో కోతుల గుంపులు చేరుతున్నాయి. ఇదే పాఠశాల ఆవరణలోని హైస్కూల్‌లో షెడ్డు కింద, వాటర్ ట్యాంక్ నీటితో భోజనం తయారు చేస్తున్నారు.



తరగతి గదుల్లోకి పొగ..

చిల్పూర్: మల్కాపూర్ ప్రాథమిక పాఠశాలలో కట్టెల పొయ్యిపై భోజనం వండుతున్నారు. దీంతో పొగ తరగతి గదుల్లోకి చేరి విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. ఆరుబయట భోజనం తయారు చేసే సమయంలో గాలులకు మంట సరిగా తగలక అన్నం ఉడకడం లేదు. నీళ్లచారు, పప్పుతో విద్యార్థులు తినలేక పోతున్నారు.



అన్నం ముద్దగా ఉంటున్నది

కట్టెల పొయ్యిమీద వంట చేసే సమయంలో మంట సరిగా తగలకు అన్నం ముద్దగా ఉంటున్నది. తినబుద్దికాదు. ఆరోజు పస్తులే. మా పాఠశాలకు ప్రత్యేకంగా వంటగది ఏర్పాటు చేయించాలి.

- శ్రీవల్లి, 5వ తరగతి, మల్కాపూర్, చిల్పూరు


చెట్టు కింద వంట చేస్తున్న కార్మికురాలు

అపరిశుభ్ర వాతావరణంలో..

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలో 32 సర్కారు స్కూళ్లు ఉండగా.. 27 స్కూళ్లలో వంట గదులు ఉన్నాయి. 5 పాఠశాలల్లో ఆరుబయటే అపరిశుభ్ర వాతావరణంలో వంట చేస్తున్నారు. మెనూ అమలు కావడం లేదు. గుడ్డు, సాంబారు, మరుసటిరోజు కూరగాయల భోజనం మాత్రమే అందిస్తున్నారు. పలు పాఠశాలల్లో బోరు నీటినే వినియోగిస్తున్నారు.

దుమ్ములోనే వంటావార్పు


లింగాలఘణపురం: స్థానిక మోడల్ స్కూల్‌లో 493 మంది విద్యార్థులున్నారు. కిచెన్ షెడ్ లేక దుమ్ము, ధూళిలోనే వంటా వార్పు చేసి అక్కడే విద్యార్థులకు వడ్డిస్తున్నారు. డ్రెయినేజీ సరిగా లేక వంట తయారు చేసే ప్రదేశం అపరిశుభ్రంగా మారుతోంది. భోజనంలో గుడ్డు ఇచ్చిన రోజు కర్రీ ఉండదు. సాంబారుతోనే సరిపెడుతున్నారు.


ఆరుబయట భోజనానికి క్యూకట్టిన విద్యార్థులు

కలెక్టర్, అధికారుల తనిఖీతో అలర్ట్

ఇటీవల రాష్ట్రంలో మధ్యాహ్న భోజనం తిని పలువురు విద్యార్థులు అస్వస్థతకు గురైన నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం ఆదేశాల మేరకు కలెక్టర్లు, జిల్లా సంక్షేమాధికారులు, ఫుడ్ సేఫ్టీ అధికారులు వరుస తనిఖీలు చేస్తున్నారు. దీంతో పాఠశాలల్లో ఇటు ఉపాధ్యాయులు, మధ్యాహ్న భోజన నిర్వాహకులు అలర్ట్ అయ్యారు. గతంలో మెనూ పాటించకున్నా ఎవరూ పట్టించుకోలేదు. కానీ వరుస తనిఖీలతో అక్కడక్కడా మెనూ అమలు చేస్తున్నట్లు 'సాక్షి' విజిట్‌లో వెల్లడైంది. ఈ పర్యవేక్షణ మూణ్నాళ్ల ముచ్చటగా మారుతుందా.. లేక నిరంతరం కొనసాగుతుందా అనేది వేచి చూడాల్సిందే.

కొడకండ్ల: నేలపైనే కూర్చుని భోజనం చేస్తున్న విద్యార్థులు



మెనూ ప్రకారం అందని భోజనం

కొడకండ్ల: మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం వడ్డించడం లేదు. మోడల్ స్కూల్‌లో 384 మంది విద్యార్థులకు 322 మంది భోజనం చేశారు. మెనూ ప్రకారం ఆకుకూర, పప్పు, వెజిటబుల్ కర్రీ, కోడిగుడ్డుతో భోజనం పెట్టాల్సి ఉండగా.. కేవలం ఆకు కూరతో చేసిన పప్పు చారు పెట్టారు. సోమ, బుధ, శుక్రవారాల్లో ఒక్కో గుడ్డు ఇవ్వాల్సి ఉండగా వారంలో ఒకటి, రెండు మాత్రమే ఇస్తున్నారని విద్యార్థులు చెప్పారు. ఒకసారి పెట్టిన భోజనం సరిపోకుంటే రెండోసారి అడిగితే పెట్టడంలేదు.

నీటి వసతి లేదు..

పాలకుర్తిటౌన్: మండల కేంద్రం టెంపుల్ కాలనీ ప్రాథమిక పాఠశాలలో 48 మంది విద్యార్థులకు 29 మంది మధ్యాహ్న భోజనం చేశారు. స్కూల్‌లో నీటి వసతి లేదు. మధ్యాహ్న భోజనానికి బయటి నుంచి తీసుకు వచ్చిన నీటినే ఉపయోగిస్తున్నారు. తాగు నీరు కూడా లేక పోవడంతో విద్యార్థులు ఇళ్ల నుంచి వాటర్ బాటిల్స్ తెచ్చుకుంటున్నారు.

పేదలకు మెరుగైన వైద్యం ప్రభుత్వ లక్ష్యం

- కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా

జనగామ: సర్కారు ఆస్పత్రుల్లో పేదలకు మెరుగైన వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని కలెక్టర్ రిజ్వాన్ బాషా అన్నారు. బుధవారం చంపక్ హిల్స్ మాతా శిశు ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన ఆయన.. ఓపీ, స్కానింగ్, ప్రసూతి వార్డు, నవజాత శిశు కేంద్రం, పిల్లల వార్డులను పరిశీలించారు. గర్భిణులను పరీక్షించిన తర్వాత వివరాలను అబ్రేవేషన్ రిజిష్టర్‌లో నమోదు చేయాలని సూచించారు. వైద్యులు, నర్సులు, సిబ్బంది సమయపాలన పాటించాలని, మందుల కొరత లేకుండా చూసుకోవాలని చెప్పారు. జనరల్ వార్డులో బాలింతలతో మాట్లాడి వైద్య సేవలపై ఆరా తీశారు. ఎంసీహెచ్ ఆవరణలో ఏర్పాటు చేసిన క్యాంటీన్‌ను తనిఖీ చేసిన ఆయన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కలెక్టర్ వెంట మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గోపాల్‌రావు, ఎంసీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ మధుసూదన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలి

ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా అన్నారు. జనగామ వ్యవసాయ మార్కెట్ కాటన్ యార్డులో ఏర్పాటు చేసిన ఐకేపీ సెంటర్‌ను ఆయన బుధవారం సందర్శించి రైతులు ఆరబోసిన ధాన్యంలో తేమ శాతాన్ని పరిశీలించారు. తేమ తగ్గిన వెంటనే ధాన్యం కొనుగోలు చేసి వివరాలను ఓపీఎంఎస్‌లో నమోదు చేయాలన్నారు. డీసీఎస్ఓ సరస్వతి, డీఎం నరేంద్ర, సివిల్ సప్లయీస్ డీటీ శ్రీనివాస్, ఐకేపీ సీసీ శ్రీనివాస్, కొనుగోలు కేంద్రం ఇన్‌చార్జ్ దేవేంద్ర, అనిత పాల్గొన్నారు.

విద్యార్థులు పట్టుదలతో చదవాలి

జనగామ రూరల్: విద్యార్థులు పట్టుదలతో చదవాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా అన్నారు. జనగామ మండల పరిధి చౌడారం గ్రామంలోని కేజీబీవీ విద్యాలయాన్ని సందర్శించిన ఆయన విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా భోజనం ఎలా ఉంది.. మెనూ ప్రకారం పెడుతున్నారా.. మౌలిక వసతులు ఎలా ఉన్నాయంటూ అడిగి తెలుసుకున్నారు. అనంతరం పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. టెన్త్‌లో ఈసారి వంద శాతం ఫలితాలు సాధించేలా కృషి చేయాలని అధికారులకు సూచించారు. గౌసియా బేగం, తహసీల్దార్ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.


బాలింతతో మాట్లాడుతున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా

రైతు వేదికల్లో ప్రత్యక్ష ప్రసారం

జనగామ రూరల్ : మహబూబ్‌నగర్‌లో ఈనెల 30న నిర్వహించే రైతు పండుగ, తెలంగాణ పండుగ కార్యక్రమం రైతు వేదికల్లో ప్రత్యక్ష ప్రసారం అవుతుందని కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు పాల్గొంటున్న ఈ వేడుకల్లో వ్యవసాయ పరికరాలు, సార పంపులు, సాంకేతికతలు, పురుగుమందులు, డ్రోన్లు తదితర 150 స్టాల్స్ ఏర్పాటు చేస్తారని వివరించారు.

సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలి

- జిల్లా వైద్యాధికారి మల్లికార్జున్‌రావు

జనగామ: సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలి.. ఈ దిశగా వైద్యులు, వైద్య సిబ్బంది దృష్టి సారించాలని జిల్లా వైద్యాధికారి మల్లికార్జున్‌రావు అన్నారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు, ఆరోగ్య సూచికలు తదితర సేవలపై ప్రోగ్రాం ఆఫీసర్లు, డిప్యూటీ డీఎంహెచ్ఓ, పీహెచ్‌సీల వైద్యాధికారులతో బుధవారం డీఎంహెచ్ఓ తన కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. డెలివరీ సమయంలో సీ సెక్షన్ తగ్గించాలని, ఏఎన్‌సీ రిజిస్ట్రేషన్లతో పాటు 3, 4వ నెల చెకప్‌లు పెరిగేలా చూడాలని చెప్పారు. అన్ని కేటగిరీల పరిధి ఆరోగ్య సూచికల డేటాను ఆన్‌లైన్ హెల్త్‌పోర్టల్‌లో అప్‌లోడ్ చేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు.

పిల్లలకు టీకాలు తప్పనిసరిగా వేయించాలి

జనగామ రూరల్: పిల్లలు ఆరోగ్యంగా ఎదగాలంటే తప్పనిసరిగా టీకాలు వేయించాలని డీఎంహెచ్ఓ మల్లికార్జున్‌రావు అన్నారు. బుధవారం పెంబర్తి, సిద్దెంకి, ఓబుల్‌కేశాపూర్ పీహెచ్‌సీలను ఆకస్మికంగా సందర్శించారు. యూఏపీ కార్యక్రమాన్ని పరిశీలించారు. అనంతరం ఆస్పత్రికి వచ్చిన పిల్లల తల్లులతో మాట్లాడుతూ సీజనల్ జ్వరాలు వస్తుంటాయని.. పరిసరాలను, ఇంటిని శుభ్రంగా ఉంచుకుని పిల్లలకు పౌష్టికాహారం అందించాలని చెప్పారు. డాక్టర్ ప్రవీణ, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ మల్లికార్జున్‌రావు

బాల్య వివాహాలను అరికట్టాలి

- సీనియర్ సివిల్ జడ్జి విక్రమ్

జనగామ రూరల్: బాల్య వివాహాలను అరికట్టాలి.. ఇందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సీనియర్ సివిల్ జడ్జి సి.విక్రమ్ అన్నారు. 'బాల్య వివాహ విముక్త భారత్'పై బుధవారం పెంబర్తిలోని తెలంగాణ జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాల, జూనియర్ కాలేజీలో ఎన్జీఓ సంస్థ, జిల్లా బాలల పరిరక్షణ విభాగం సంయుక్తంగా నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. బాల్యంలో వివాహం చేయడం వల్ల శారీరక, మానసిక ఎదుగుదల ఆగిపోతుందని, చిన్న వయసులోనే అనారోగ్యాలకు గురవుతారని పేర్కొన్నారు. ప్రతీ కుటుంబం బాల్య వివాహాలు, 2006 బాల్య వివాహాల నిరోధక చట్టంపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. జిల్లా సంక్షేమాధికారి ఫ్లోరెన్స్ మాట్లాడుతూ.. విద్యార్థినీ విద్యార్థులు బాలల హక్కులు, బాధ్యతలు తెలుసుకొని భవిష్యత్‌ను తీర్చిదిద్దుకోవాలని సూచించారు. పిల్లలు ప్రభుత్వం అందించే సంక్షేమ కార్యక్రమాలను ఉపయోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీడబ్ల్యూసీ చైర్ పర్సన్ ఉప్పలయ్య, జిల్లా బాలల పరిరక్షణ అధికారి రవికాంత్, చైల్డ్ హెల్ప్‌లైన్ కోఆర్డినేటర్ రవికుమార్, స్కోప్ ఎన్జీఓ చైర్మన్ బండి సాయన్న, జిల్లా ప్రాజెక్టు కోఆర్డినేటర్ మనోజ్‌కుమార్, లీగల్ ఎయిడ్ కౌన్సిల్ రవీందర్, పాఠశాల ప్రిన్సిపాల్ రుక్సానా తదితరులు పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి విక్రమ్

బాల్య వివాహాలు లేని జిల్లాగా తీర్చిదిద్దాలి : కలెక్టర్

బాల్య వివాహాలు లేని జిల్లాగా తీర్చిదిద్దాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా అన్నారు. బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యాన బుధవారం కలెక్టరేట్‌లో 'బాల్ వివాహ్ విముక్త్ భారత్' పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. చిన్న వయసులో వివాహం చేయడం వల్ల కలిగే అనర్థాలపై అన్ని గ్రామాల్లో విస్తృతంగా ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. ఎక్కడైనా బాల్య వివాహం జరిగితే చైల్డ్ హెల్ప్‌లైన్ నంబర్ 1098కు సమాచారం ఇవ్వాలని కోరారు. సంక్షేమాధికారి ఫ్లోరెన్స్, సీడబ్ల్యూసీ చైర్ పర్సన్ ఉప్పలయ్య, బాలల పరిరక్షణ అధికారి ఎల్.రవికాంత్, స్వప్నరాణి తదితరులు పాల్గొన్నారు.


సబ్‌జైలును సందర్శించిన జడ్జి విక్రమ్

జిల్లా కేంద్రంలోని సబ్ జైలును బుధవారం సీనియర్ సివిల్ జడ్జి సి.విక్రమ్ సందర్శించారు. జైలు సిబ్బంది ఏమైనా ఇబ్బందులకు గురిచేస్తున్నారా.. మేల్ నర్సు రోజూ వస్తున్నారా అని ఖైదీలను అడిగి తెలుసుకున్నారు. కోర్టుకి హాజరు పరిచే విషయంలో జైలు సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. కార్యక్రమంలో లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఎం.రవీంద్ర, జ్యోత్స్న, ఆర్.శ్రీహరి, లలిత తదితరులు పాల్గొన్నారు.

తెగుళ్ల నివారణకు ఎన్‌పీఎస్ఎస్ యాప్ సేవలు

- జిల్లా వ్యవసాయాధికారి రామారావు

జనగామ: పంటలను ఆశించే తెగుళ్ల నివారణకు ఎన్‌పీఎస్ఎస్ మొబైల్ యాప్(నేషనల్ పెస్ట్ సర్వైలెన్స్ సిస్టమ్) సేవలు ఉపయోగపడతాయని జిల్లా వ్యవసాయాధికారి రామారావు తెలిపారు. సెంట్రల్ ఇంటిగ్రేటెడ్ పెస్ట్ మేనేజ్‌మెంట్ సెంటర్ హైదరాబాద్ ఆధ్వర్యాన కలెక్టరేట్ డీఏఓ కార్యాలయంలో బుధవారం ప్రగతిశీల రైతులకు మొబైల్ అప్లికేషన్‌పై నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రైతులు తమ స్మార్ట్ ఫోన్ గూగుల్ ప్లే స్టోర్ ద్వారా యాప్ డౌన్‌లోడ్ చేసుకుని అందులో పంటలకు ఆశించే తెగుళ్లను తెలుసుకుని సత్వర నివారణ చర్యలు తీసుకోవచ్చని చెప్పారు. ఇలా చేయడం వల్ల పురుగు మందుల ఖర్చు తగ్గించుకోవచ్చని, యాప్ ద్వారా రైతులు అవసరమైన సలహాలు సైతం పొందవచ్చని వివరించారు. కార్యక్రమంలో ప్లాంట్ ప్రొటెక్షన్ ఆఫీసర్లు ఆర్.సునీత, వెంకటరెడ్డి, అసిస్టెంట్ ప్లాంట్ ప్రొటెక్షన్ ఆఫీసర్లు బి.బసవన్నప్ప, శ్వేత, సూర్యాప్, సీపీఎంసీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.


యాప్ సేవలపై అవగాహన కల్పిస్తున్న డీఏఓ

బాధ్యతలు స్వీకరించిన డీఈఓ రమేశ్

జనగామ రూరల్: జిల్లా విద్యాశాఖ అధికారిగా ఎం.రమేశ్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ రిజ్వాన్ బాషాను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో జీసీడీఓ గౌసియాబేగం, విద్యా శాఖ అధికారులు పాల్గొన్నారు.

భద్రకాళి అమ్మవారికి తెలంగాణ అడిషనల్ సెంట్రల్ పీఎఫ్ కమిషనర్ పూజలు



కమిషనర్ సత్యనారాయణను పూర్ణకుంభంతో స్వాగతిస్తున్న అర్చకులు

హన్మకొండ కల్చరల్ : భద్రకాళి దేవాలయాన్ని బుధవారం తెలంగాణ అడిషనల్ సెంట్రల్ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్ ఎంఎస్‌కేవీవీ సత్యనారాయణ దంపతులు సందర్శించారు. ఈ సందర్భంగా వారిని అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతించారు. ముందు ఆదిశంకరులు, వల్లభగణపతిని దర్శించారు. అనంతరం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేకపూజలు నిర్వహించారు. కాగా, అర్చకులు.. సత్యనారాయణ దంపతులకు తీర్థప్రసాదాలు, అమ్మవారి శేషవస్త్రాలు, మహాదాశీర్వచనం అందజేశారు. కార్యక్రమంలో రీజినల్ పీఎఫ్ కమిషనర్ బిందు భూషణ్, తానయ్య, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పాల్గొన్నారు.

కొండగట్టులో జనగామ జిల్లా జడ్జి పూజలు



జడ్జి రవీందర్ శర్మను శాలువాతో సత్కరిస్తున్న పర్యవేక్షకులు హరిహరనాథ్

కొండగట్టు(చొప్పదండి): కొండగట్టు అంజన్నను జనగామ జిల్లా ప్రిన్సిపల్ జడ్జి డి.రవీందర్‌శర్మ దంపతులు బుధవారం దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు వారితో ప్రత్యేక పూజలు చేయించి తీర్థప్రసాదాలు అందించారు. ఆలయ పర్యవేక్షకులు గుండి హరిహరనాథ్ శాలువాతో సత్కరించి లడ్డూ ప్రసాదం అందించారు.

ఎక్సైజ్ ఎస్సై రతన్‌ప్రసాద్‌రెడ్డికి శుభాకాంక్షలు



రతన్‌ప్రసాద్‌రెడ్డి

కాజీపేట అర్బన్: టీజీపీఎస్సీ నిర్వహించిన ఎఫ్ఎస్ఓ ఫలితాల్లో వైరా ఎక్సైజ్ ఎస్సై డాక్టర్ నల్లాల రతన్‌ప్రసాద్ రెడ్డి స్టేట్‌ఫస్ట్ ర్యాంకు సాధించి చార్మినార్ జోన్ ఎఫ్ఎస్ఓగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఉమ్మడి వరంగల్ ఎక్సైజ్ శాఖ సిబ్బంది బుధవారం రతన్‌ప్రసాద్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. రతన్‌ప్రసాద్‌రెడ్డి 2020లో గ్రూప్–2లో ఎక్సైజ్ ఎస్సైగా ఎంపికై వైరాలో విధులు నిర్వర్తిస్తున్నారు. కాగా, రతన్‌ప్రసాద్‌రెడ్డి.. ఆహార భద్రతా అధికారి(ఎఫ్ఎస్ఓ) పోస్టుకు ఎంపిక కావడం అభినందనీయమని ఎక్సైజ్ సిబ్బంది పేర్కొన్నారు.

సౌత్‌వెస్ట్‌జోన్ వర్సిటీ జూడోటోర్నమెంట్‌కు కేయూ జట్టు



కేయూ జట్టుతో స్పోర్ట్స్‌బోర్డు సెక్రటరీ వెంకయ్య

కేయూ క్యాంపస్: మధ్యప్రదేశ్ రాష్ట్రం భోపాల్‌లోని ఎల్ఎన్‌సీటీ యూనివర్సిటీలో ఈనెల 28నుంచి 30వతేదీ వరకు నిర్వహించనున్న సౌత్‌వెస్ట్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ జూడో పురుషుల టోర్నమెంట్‌కు కాకతీయ యూనివర్సిటీ జట్టును ఎంపిక చేశామని కేయూ స్పోర్ట్స్‌బోర్డుసెక్రటరీ ప్రొఫెసర్ వెంకయ్య బుధవారం తెలిపారు. ఈ జట్టులో ఎల్.లక్ష్మణ్ (కేడీసీ హనుమకొండ), బి. జయదీప్(సీకేఎం కాలేజీ, వరంగల్), ఎం. ముఖేశ్, పి. నాగేంద్ర (యూనివర్సిటీ ఆర్ట్స్‌అండ్ సైన్స్‌కాలేజీ , హనుమకొండ), ఎం. దర్శిత్‌నాయక్ (ఎల్‌బీకాలేజీ, వరంగల్), బి. రాహుల్ (కేయూ స్కూల్‌ఆఫ్‌లెర్నింగ్), జె. మహేశ్ (వాగ్దేవి డిగ్రీ కాలేజీ, హనుమకొండ) ఉన్నారు. వీరికి మేనేజర్‌గా హనుమకొండలోని వాగ్దేవి డిగ్రీ, పీజీ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ బి. రాము వ్యవహరిస్తున్నారని వెంకయ్య తెలిపారు.

నైపుణ్యం.. ఉద్యోగ సోపానం



ఇంజనీరింగ్ కోర్సు.. ఒకప్పుడు విద్యార్థులకు ప్రథమ చాయిస్. ఈ కోర్సు తప్ప మరేది ఎంచుకోని పరిస్థితి. జాబ్ ఓరియెంటెడ్ కోర్సు. ప్రస్తుతం లెక్కకు మించి అభ్యర్థులు డిగ్రీ చేతపట్టుకుని తిరుగుతున్నారు. కళాశాలలు పెరగడం .. ఎక్కువ మంది ఈ రంగం వైపు ఆసక్తి చూపడంతో ఇంజనీరింగ్ పట్టభద్రుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. దీంతో డిగ్రీ సర్టిఫికెట్‌తోనే ఉద్యోగం వచ్చే రోజులు పోయాయి. ప్రత్యేక నైపుణ్యాలు చాటుకుంటున్న వారికే సంస్థలు ఉద్యోగం ఇస్తున్నాయి. ఈపరిస్థితుల్లో నైపుణ్యాలే విజయానికి మెట్టులా భావించే విద్యార్థులే విజయం సొంతం చేసుకుంటున్నారు.

ప్రత్యేక స్కిల్స్ ఉంటేనే ఉపాధి అవకాశాలు


- లక్ష్యం చేరుకోవాలంటే అనుబంధ కోర్సులు చదవాలి
- నిపుణుల సూచనలు పాటిస్తే మెరుగైన కొలువు

కాజీపేట: చదువుతో ఉద్యోగ సాధనే లక్ష్యం అనుకుంటే సర్టిఫికెట్ కాదు.. నైపుణ్యాలు ప్రదర్శించే సామర్థ్యం ఉండాలి. ఏటా లక్షలాది మంది ఇంజనీరింగ్ పట్టభద్రులు కళాశాలల నుంచి బయటకు వస్తుండడంతో ఉద్యోగంలో తీవ్ర పోటీ అనివార్యమైంది. ప్రతి ఇంట్లో కనీసం ఒకరైనా ఇంజనీరింగ్ పూర్తి చేసిన వారుంటున్నారు. అందుకే ఇంజనీరింగ్ పూర్తి చేసినా ఉద్యోగం ఖాయమనే పరిస్థితి పోయింది. ఏదో ఒక ప్రత్యేకత ఉంటే తప్ప ఉద్యోగం వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. ఈ పరిస్థితుల్లో ఇంజనీరింగ్ కోర్సు పూర్తి చేసిన విద్యార్థులు అదనంగా అడ్వాన్స్‌డ్ కోర్సులు నేర్చుకుంటేనే ప్రయోజనం ఉంటుందని నిపుణులు చెబుతున్నారు.

మెకానికల్: భారత పారిశ్రామిక రంగంలో మెకానికల్ విద్యార్థులకు అధిక డిమాండ్ ఉంది. అందుకే ఎక్కువ మంది ఈ సీటు దక్కించుకునేందుకు యత్నిస్తున్నారు. మెకానికల్ విభాగంలో ఇంజనీరింగ్ పూర్తి చేసిన విద్యార్థులు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఆటో కేడ్, రోబోటిక్స్, కెటియా కోర్సులు కూడా పూర్తి చేస్తే ప్రయోజనం ఉంటుంది. 3 నుంచి 6 నెలల్లో వీటిని పూర్తి చేయొచ్చు. ఈ కోర్సుల్లో ప్రావీణ్యం ఉన్న వారికి ఇంటర్వ్యూలలో అధిక ప్రాధాన్యం ఉంటుంది.

అడ్వాన్స్‌డ్ కోర్సులతో ఎంతో మేలు..

ప్రస్తుత పోటీ ప్రపంచంలో నైపుణ్యం ముఖ్యం. చాలా మంది విద్యార్థులు తమ చదువుకు, చేస్తున్న ఉద్యోగాలకు సంబంధం ఉండడం లేదు. ఉన్నతంగా చదివినా దానికి సార్థకత లభించడం లేదు. ఇంజనీరింగ్ పూర్తి చేసినంత మాత్రాన ఉద్యోగాలు వస్తాయనుకోవడం సరికాదు. ఇంజనీరింగ్‌తో పాటు అడ్వాన్స్‌డ్ ప్రత్యేక కోర్సులు పూర్తి చేసి నైపుణ్యం సాధిస్తేనే ప్రయోజనం.



సీఎస్ఈ: 6 నుంచి 12 నెలలు కొనసాగే ఈ కోర్సును అభ్యసించిన వారు సాఫ్ట్‌వేర్ రంగంలో రాణించేందుకు వీలుంటుంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (కృత్రిమ మేధ), మిషన్ లెర్నీ, బిగ్ డేటా అనిటిక్స్, సైబర్ సెక్యూరిటీ కోర్సులు నేర్చుకోవాలి. ఇంజనీరింగ్‌తో పాటు ప్రత్యేక నైపుణ్యం కోర్సులు నేర్చుకోవడం ద్వారా ఉన్నత ఉద్యోగాలు సాధించొచ్చు.

ఈఈఈ: ఈ కోర్సును అభ్యసించిన స్టూడెంట్స్ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ రంగంతో పాటు సాఫ్ట్‌వేర్ రంగంలో ఉద్యోగాలు దక్కించుకోవాలంటే అదనంగా కంప్యూటర్‌లో ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్‌తో పాటు పవర్ టెక్నాలజీ, సోలార్ కోర్సులు పూర్తి చేయాలి. అప్పుడే భవిష్యత్ ఉంటుంది. ఈ కోర్సులు 3 నుంచి 6 నెలల లోపు పూర్తి చేయొచ్చు.

ఈసీఈ: ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్ రంగంలోకి వెళ్లేందుకు ఈ కోర్సు దోహదపడుతుంది. ఈ కోర్సును అభ్యసించిన ఎక్కువ మంది సాఫ్ట్‌వేర్ రంగంలో స్థిరపడుతున్నారు. ఈఎల్ఎస్ఐ డిజైన్ కోర్సులు, బిగ్‌డేటా ఎనటిక్స్, ఆండ్రాయిడ్ సిస్టమ్, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ (కృత్రిమ మేధ), మిషన్ లెర్నీ, సైబర్ సెక్యూరిటీ తదితర కోర్సులు పూర్తి చేస్తే ప్రయోజనం ఉంటుంది. వీటితో పాటు ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ పూర్తిచేస్తే లాభమని నిపుణులు చెబుతున్నారు. ఈ కోర్సుల కాలపరిమితి 6 నెలలు.

సివిల్: సివిల్ ఇంజనీరింగ్‌లో స్ట్రక్చరల్ ఇంజనీరింగ్, రివిట్ ఆర్కిటెక్చర్, ఆటోక్యాడ్, రివిట్ స్ట్రక్చర్ కోర్సులు అభ్యసిస్తే లాభం ఉంటుంది. వీటి ద్వారా ప్రాజెక్టుల తయారీకి ఎంతో ఉపయుక్తమవుతుంది. పరిశ్రమల నిర్మాణంలో సివిల్ కోర్సు తన ప్రత్యేకతను చాటుకుంటోంది.

కళాశాలల్లోనే ప్రత్యేక శిక్షణ కేంద్రాలు..



ఇంజనీరింగ్ కళాశాలల్లోనే విద్యార్థులకు స్కిల్స్ పెంచడానికి ప్రత్యేక శాఖను ఏర్పాటు చేశాం. కళాశాల స్థాయిలోనే విద్యార్థులకు తగిన ఉద్యోగావకాశాలు దక్కేలా కృషి చేస్తున్నాం. విద్యార్థులు పట్టుదలతో నేర్చుకుంటే ఉద్యోగావకాశాలు విస్తృతంగా వస్తాయి. లేదంటే నిరాశే.

–తాళ్ల వంశీ, తాళ్ల పద్మావతి ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్


క్యాంపస్ సెలక్షన్లలో అంతంతే...

ఇంజనీరింగ్ కళాశాలలు అధిక సంఖ్యలో ఉండడంతో క్యాంపస్ ఇంటర్వ్యూల్లో నెట్టుకొస్తున్న వారి సంఖ్య 30 శాతం మించి ఉండడం లేదు. మెరికల్లాంటి వారికే అవకాశం వస్తోంది. మాములు మార్కులతో పాసైన వారికి సర్టిఫికెట్ మిగులుతోంది. దీంతో సంబంధంలేని ఉద్యోగంలో రూ.10 వేలు, రూ.12 వేల వేతనంతో జీవితంలో స్థిరపడుతున్నారు. అలా కాకుండా చదువుకునే సమయంలోనే ఆసక్తి ఉన్న రంగాలపై దృష్టిసారించి ఆ దిశగా నైపుణ్యం సాధిస్తే ఈ సమస్య ఉండదు.

ఉన్నత విద్యపై దృష్టి సారించాలి..

ఉన్నత రంగాల్లో స్థిరపడాలనుకునే యువత బీటెక్‌తో చదువు ఆపకుండా ప్రొఫెషనల్ కోర్సులు చదివితే ఉత్తమం. ఇంజనీరింగ్ పూర్తయ్యాక ఇండియన్ రైల్వే సర్వీసెస్, ఇండియన్ ఇంజనీరింగ్ సర్వీసెస్ సాధించేందుకు కృషి చేయాలి. గేట్ అర్హత సాధించి ఎంటెక్ చేయడం వల్ల ఉన్నత లక్ష్యాలు సాధించే అవకాశం ఉంది.

నాన్‌టీచింగ్ ఉద్యోగినిపై అసభ్యకర ప్రవర్తన!



విద్యారణ్యపురి: హనుమకొండలోని ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో ఇటీవల ఓ అధ్యాపకుడు నాన్‌టీచింగ్ ఉద్యోగినిపై అసభ్యకరంగా ప్రవర్తించడంతో వీరి మధ్య వివాదం తలెత్తినట్లు సమాచారం. తన పట్ల దురుసుగా ప్రవర్తించటంతోపాటుగా తనను ముట్టుకునే యత్నం చేశారని ఆ అధ్యాపకుడిపై ఉద్యోగిని సంబంధిత కళాశాల ప్రిన్సిపాల్‌కు ఫిర్యాదు చేయగా ఆ అధ్యాపకుడికి ప్రిన్సిపాల్ మెమో జారీచేశారని అందుకు ఆ అధ్యాపకుడు వివరణ కూడా లిఖితపూర్వకంగా ఇచ్చారని తెలిసింది. అదేరోజు ఆ అధ్యాపకుడు సదరు ఉద్యోగినికి క్షమాపణలు కూడా చెప్పారని సమాచారం. దీంతో ఇద్దరి మధ్య రాజీకుదరడంతో తన ఫిర్యాదును వెనక్కి తీసుకుంటున్నట్లు ఆ ఉద్యోగి ప్రిన్సిపాల్ దృష్టికి తీసుకెళ్లారని తెలిసింది. అయితే ఈ వ్యవహారంపై ప్రిన్సిపాల్ హనుమకొండ డీఐఈఓ దృష్టికి తీసుకెళ్లారని, డీఐఈఓ సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారని సమాచారం. వివాదం సద్దుమణిగినా ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లడంతో చర్చనీయాంశంమైంది.

మహిళపై అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తికి జైలు

మరిపెడ రూరల్ : ఓ మహిళ పట్ల అసభ్యకరంగా వ్యవహరించిన వ్యక్తికి తొర్రూరు సివిల్ కోర్టు జైలుశిక్ష విధించినట్లు మరిపెడ ఎస్సై బోలగాని సతీష్ బుధవారం తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. మండలంలోని స్టేజీ తండా గ్రామ పంచాయతీ శివారు కుడియా తండాకు చెందిన ఓ గిరిజన మహిళ పట్ల అదే తండాకు చెందిన జాటోత్ అశోక్ అసభ్యకరంగా ప్రవర్తించాడు. ఈ క్రమంలో బాధిత మహిళ మరిపెడ పోలీస్ స్టేషన్‌లో సదరు వ్యక్తిపై ఫిర్యాదు చేసింది. మరిపెడ రెండో ఎస్సై సంతోశ్ విచారణ చేపట్టి నిందితుడిని తొర్రూర్ కోర్టులో హాజరు పర్చాడు. వాదోపవాలు విన్న తొర్రూర్ సివిల్ కోర్టు నిందితుడికి బెయిల్ వచ్చేవరకు జైలులోనే ఉండాలని శిక్ష విధించింది.

టెలిగ్రాం యాప్‌లో పెట్టుబడి పేరుతో మోసం

- రూ.4,26,966 స్వాహా చేసిన సైబర్ నేరగాళ్లు
- లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయించిన బాధితుడు



మహబూబాబాద్ రూరల్ : ఓ యువకుడు.. సైబర్ నేరగాళ్ల వలలో పడ్డాడు. టెలిగ్రాం యాప్‌లో పెట్టుబడి పెడితే మరికొంత మొత్తంలో డబ్బులు వస్తాయని ఆశ చూపగా దీనిని నమ్మిన సదరు యువకుడు ఆ యాప్‌లో రూ.4,26,966 పెట్టుబడి పెట్టాడు. అనంతరం ఎలాంటి సమాచారం లేకపోవడంతో నష్టపోయానని గుర్తించి లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయించాడు. ఈ ఘటన బుధవారం మహబూబాబాద్ మండలం సోమ్లాతండాలో వెలుగు చూసింది. రూరల్ ఎస్సై వి.దీపికారెడ్డి కథనం ప్రకారం.. సోమ్లాతండా గ్రామానికి చెందిన ధరావత్ యుగంధర్ ఉద్యోగ సాధన కోసం హైదరాబాద్‌లో ఉంటూ కోచింగ్ తీసుకుంటున్నాడు. ఈ క్రమంలో అతడికి అక్టోబర్ 9వ తేదీన టెలిగ్రాం యాప్‌లో పెట్టుబడి పెడితే కొంత మొత్తం పెంచి డబ్బులు ఇస్తామని ఓ ఫోన్ కాల్ రాగా అది నిజమని నమ్మాడు. ఆ వెంటనే అదేరోజున ఒకసారి రూ.92 వేలు, మరోసారి రూ.9,200 అవతలి వారికి డబ్బులు బదిలీ చేశాడు. మరుసటి రోజు కాకుండా 11వ తేదీన రూ.40 వేలు, రూ.66,899, రూ.1.28 లక్షలు, రూ.50 వేలు, రూ.50 వేల పైచిలుకు మొత్తం రూ.4,26,966 డబ్బులను టెలిగ్రాం యాప్‌లో ఫోన్ కాల్ చేసిన వారికి పంపించాడు. అవతలి వ్యక్తుల నుంచి ఎలాంటి సమాచారం ఉండకపోగా తిరిగి డబ్బులు రాకపోవడంతో యుగంధర్ తాను సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయానని గుర్తించాడు. వెంటనే సైబర్ విభాగంలో ఫిర్యాదు చేసి అక్కడి నుంచి మహబూబాబాద్ రూరల్ పోలీసులను ఆశ్రయించాడు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని రూరల్ ఎస్సై వి.దీపికారెడ్డి తెలిపారు.

ప్రజల ఆకాంక్షలు నెరవేరిస్తేనే మనుగడ

- ఓయూ సోషల్ సైన్స్ మాజీ డీన్ ప్రొఫెసర్ శ్రీనివాసులు



మాట్లాడుతున్న ఓయూ పొలిటికల్ సైన్స్ మాజీ డీన్ ప్రొఫెసర్ శ్రీనివాసులు

కేయూ క్యాంపస్: ప్రజల ఆకాంక్షలు నెరవేరిస్తేనే ప్రభుత్వాలకు మనుగడ ఉంటుందని, ప్రజలకు ఇచ్చిన హామీలను అధికారంలోనికి వచ్చిన ప్రభుత్వాలు చిత్తశుద్ధితో అమలు చేసినప్పుడే అభివృద్ధి సాధ్యమని హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ సోషల్‌సైన్స్ మాజీ డీన్ రిటైర్డ్ ఆచార్యులు కె. శ్రీనివాసులు అన్నారు. బుధవారం కేయూలోని రాజనీతిశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో పరిపాలనభవనంలోని సెనేట్‌హాల్‌లో నిర్వహించిన జాతీయ సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. 'తెలంగాణ రాష్ట్ర ఆకాంక్షలు, వాగ్దానాలు–రాజకీయ పనితీరు' అనే అంశంపై జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు. అణగారిన ప్రజలను జీవితాంతం ఆర్థికంగా,ఆత్మ గౌరవంతో జీవించేలా చేసేవే నిజమైన సంక్షేమ పథకాలన్నారు. గత ప్రభుత్వం తెలంగాణ ప్రజల ప్రజాస్వామిక ఉద్యమ ఆకాంక్షలను నెరవేర్చలేకపోయిందన్నారు. ప్రలోభపూరిత వాగ్దానాలు, మాటలతోపాలన కొనసాగించం వల్లే అధికారం కోల్పోయిందన్నారు. ఈ సదస్సుకు పొలిటికల్ సైన్స్ విభాగం అధిపతి డాక్టర్ సంకినేని వెంకట్ అధ్యక్షత వహించారు. ఓయూ హిస్టరీ విభాగం రిటైర్డ్ ఆచార్యుడు అడప సత్యనారాయణ, సోషల్‌సైన్స్‌డీన్ ఆచార్య టి. మనోహర్, కేయూ యూజీసీ కోఆర్డినేటర్ ఆచార్య ఆర్. మల్లికార్జున్‌రెడ్డి, ఎస్‌డీఎల్‌సీఈ డైరెక్టర్ ఆచార్య వి. రాంచంద్రం, పొలిటికల్ సైన్స్ రిటైర్డ్ ఆచార్యుడు హరిప్రసాద్ మాట్లాడారు. అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు విధానం మారదా?

- మిల్లర్ల అక్రమాలు అరికట్టాలి
- అఖిల భారత కిసాన్ సభ జాతీయ ఉపాధ్యక్షుడు సారంపల్లి మల్లారెడ్డి



రైతులతో మాట్లాడుతున్న సారంపల్లి మల్లారెడ్డి

ఐనవోలు: ప్రభుత్వం మారిన ధాన్యం కొనుగోలు విధానం మాత్రం మారడం లేదని అఖిల భారత కిసాన్ సభ జాతీయ ఉపాధ్యక్షుడు సారంపల్లి మల్లారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం మండలంలోని కొండపర్తిలో ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంటాలు వేయగానే రైతుకు కాంటా చిట్టీలు(తూకం వివరాలు) ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. మిల్లరు దగ్గర ధాన్యం దిగుమతి అయ్యే సమయంలో కోత పడగా వచ్చిన తూకం వివరాలు మాత్రమే రైతుకు చూపుతున్నారన్నారు. ఫలితంగా రైతులు క్వింటాల్‌కు 5 కిలోలు నష్టపోతున్నట్లు చెప్పారు. టార్పాలిన్లు ఏర్పాటు చేయడం లేదని, గన్నీ సంచులు కూడా ఇవ్వడం లేదని వాపోయారు. సివిల్ సప్లై అధికారులు దృష్టి సారించి తరుగు పేరుతో మోసం చేస్తున్న మిల్లర్లపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. జీఎంపీఎస్ జిల్లా కార్యదర్శి కాడబోయిన లింగయ్య మాట్లాడుతూ కొనుగోలు కేంద్రంలో ఇప్పటి వరకు 250 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేయగా తరుగు పేరిట రూ. 5,90,500 దోపిడీ జరిగిందని ఆరోపించారు. రైతు సంఘం జిల్లా నాయకులు గుండెకారి మహేందర్, మండల అధ్యక్షుడు మడిగే నాగరాజు, నాయకులు నారాయణరెడ్డి, బాబురావు, ఉప్పలయ్య, గోపాల్‌రావు, ధర్మారావు, సమ్మారావు, మహేందర్‌రెడ్డి, రవీందర్‌రావు, లక్ష్మీనారాయణ, వెంకటాద్రి తదితరులు పాల్గొన్నారు.

పాపం.. పసివాళ్లు

- కేన్సర్‌తో రెండేళ్ల క్రితం తండ్రి.. బుధవారం తల్లి మృతి
- అనాథలుగా మారిన చిన్నారులు
- ప్రభుత్వం, దాతలు.. చిన్నారి బాలికలను ఆదుకోవాలని గ్రామస్తుల వేడుకోలు



తల్లికి తలకొరివి పెడుతున్న చిన్న కూతురు సుమలత

కురవి: పాపం.. పసివాళ్లు. ఎంత కష్టం వచ్చింది. విధి వక్రీంచడంతో ఆడుతూ పాడుతూ ఆనందంగా గడపాల్సిన వయసులో ఈ చిన్నారులకు ఎవరూ పూడ్చలేని సమస్య ఎదురైంది. తల్లిదండ్రులిద్దరినీ మాయదారి రోగం కేన్సర్ బలితీసుకుంది. దీంతో ఆ బాలికలు అనాథలుగా మారారు. రెండు సంవత్సరాల క్రితం కేన్సర్‌తో తండ్రి.. ఇప్పుడు తల్లి మృతి చెందగా చిన్నారులు ఒంటరిగా మిగిలారు. ఈ విషాదకర ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. మహబూబాబాద్ జిల్లా కురవి మండలం బలపాల గ్రామానికి చెందిన నక్క గుర్వమ్మ, భిక్షం దంపతుల కుమార్తె హేమలత(35)ను కొన్నేళ్ల క్రితం సీరోలు మండలం కాంపల్లి గ్రామానికి చెందిన గో ల్కొండ వెంకటరాములుకు ఇచ్చి వివాహం చేశా రు. ఈ దంపతులకు ఇద్దరు కూతుళ్లు సంతానం. ప్రస్తుతం పెద్ద కూతురు నాగమణికి 11 సంవత్సరాలు ఉన్నాయి. ఈ చిన్నారి 5వ తరగతి చదువుతోంది. చిన్న కూతురు సుమలత 10 సంవత్సరాలు ఉండి నాలుగో తరగతి చదువుతోంది. ఈ క్రమంలో కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్న క్రమంలో రెండేళ్ల క్రితం వెంకటరాములు కేన్సర్ మహమ్మారితో మృతి చెందాడు. దీంతో హేమలత తన ఇద్దరు కూతుళ్లు నాగమణి, సుమలతలను తీసుకుని తల్లి గారి ఊరు బలపాలకు వచ్చి జీవిస్తోంది. తల్లి గుర్వమ్మ అండతో హేమలత పిల్లలను చదివిస్తూ జీవనం కొనసాగిస్తోంది. ఈ క్రమంలో హేమలత సైతం కేన్సర్‌తో బాధపడుతూ బుధవారం మృతి చెందింది. దీంతో ఆ చిన్నారులు అనాథలుగా మారారు. దీనిపై ప్రభుత్వం, దాతలు స్పందించి తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారులను ఆదుకోవాలని గ్రామమస్తు కోరుతున్నారు. కాగా, చిన్న కుమార్తె సుమలత తల్లికి తలకొరివి పెట్టింది.

ప్రేమ వ్యవహారమా! వివాహేతర సంబంధమా?

- చంద్రుపల్లిలో యువకుడి దారుణహత్య
- ఇద్దరు బైక్‌పై వచ్చి హత్య చేసి పరార్
- అడ్డొచ్చిన హార్వెస్టర్ డ్రైవర్‌పై దాడికి యత్నం
- వివరాలు సేకరిస్తున్న పోలీసులు



శ్రీకాంత్‌గౌడ్(ఫైల్)



మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ రామచంద్రారావు, సిబ్బంది

కాళేశ్వరం: ఓ యువకుడిని ఇద్దరు దుండగులు నడిరోడ్డుపై దారుణంగా హత్య చేశారు. ఈ ఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం చంద్రుపల్లిలో బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. మంచిర్యాల జిల్లా చెన్నూరు మండలం కొమ్మెర గ్రామానికి చెందిన ముత్యాల చంద్రక్క, అంకయ్య దంపతుల చిన్నకుమారుడు శ్రీకాంత్‌గౌడ్(23) నాలుగు రోజుల నుంచి తన హార్వెస్టర్‌తో చంద్రుపల్లిలో వరి పొలాల కోతలు చేపడుతున్నాడు. ఈ క్రమంలో బుధవారం సాయంత్రం ఇద్దరు దుండగులు పల్సర్‌బైక్‌పై వచ్చి శ్రీకాంత్‌గౌడ్‌తో గొడవ పడ్డారు. కత్తులతో పొడిచి హత్య చేశారు. దీనిని గమనించిన హార్వెస్టర్ డ్రైవర్ కమ్మగోని ప్రదీప్‌గౌడ్ పరుగున వచ్చిన ఆపే ప్రయత్నం చేయగా అతడిపై కూడా దాడికి పాల్పడేందుకు యత్నించారు. దీంతో అతను భయపడి దుండగులు వచ్చిన బైక్ తాళాలు తీసుకుని గ్రామంలోకి పరుగులు తీశాడు. గ్రామస్తులు వస్తారని భయపడిన దుండగులు పొలాల మీదుగా పరారయ్యారు.

యువకుడి కాల్ డేటా పరిశీలిస్తున్న పోలీసులు

కాగా, ఈ హత్యకు ప్రేమ వ్యవహారమా! వివాహేతర సంబంధమా లేదా మరే ఇతర కారణాలు ఉన్నాయా అనే కోణంలో పోలీసులు సదరు యువకుడి కాల్ డేటా పరిశీలిస్తున్నారు. మహదేవపూర్ సీఐ రామచంద్రారావు, మహదేవపూర్, కాళేశ్వరం ఎస్సైలు పవన్‌కుమార్, చక్రపాణితోపాటు సిబ్బంది ఘటనా స్థలికి చేరుకుని వివరాలు సేకరిస్తున్నారు. అన్నారం పరిధిలోని సీసీ ఫుటేజీ పరిశీలిస్తున్నారు. దుండగుల పల్సర్ బైక్, తమ వెంట తీసుకొచ్చిన తెల్ల కల్లు బాటిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. మృతుడి కుటుంబ సభ్యుల వద్ద హత్యకు గల కారణాలపై ఆరా తీశారు. కాగా, దుండగులు కొమ్మెర గ్రామంలో కూడా మృతుడి ఇంటి వద్ద, చంద్రుపల్లి పరిసరాల్లో నాలుగు రోజులు రెక్కీ నిర్వహించినట్లు తెలిసింది. ఈ ఘటనపై మృతుడి సోదరుడు శ్రీధర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రామచంద్రారావు తెలిపారు. మృతదేహాన్ని మహదేవపూర్ ఆసుపత్రికి తరలించారు.

చలి తీవ్రత ఎక్కువైతే నల్లతామర

- జేవీఆర్ ఉద్యాన పంటల పరిశోధన కేంద్రం మల్యాల శాస్త్రవేత్త నాగరాజు
- నాచినపల్లిలో పత్తి, పసుపు పంటల పరిశీలన



మిరప పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

దుగ్గొండి: చలి తీవ్రత పెరిగేకొద్దీ మిరప పంటలో నల్లతామర పురుగుల ఉధృతి ఎక్కువ అవుతుందని జేవీఆర్ ఉద్యాన పంటల పరిశోధన కేంద్రం మల్యాల శాస్త్రవేత్త కత్తుల నాగరాజు అన్నారు. ఈ మేరకు బుధవారం మండలంలోని నాచినపల్లి గ్రామంలో మిరప, పసుపు పంటలను పరిశీలించారు. మిరప పంటలో కుచ్చు తెగులు, కొమ్మ, వేరు కుళ్లు తెగుళ్లను గమనించి నివారణ చర్యలు సూచించి మాట్లాడారు. కుచ్చు తెగులు నివారణకు ఎకరాకు 20 నుంచి 40 వరకు పసుపు, నీలిరంగు జిగురు అట్టలను ఏర్పాటు చేయాలన్నారు. పిప్రోనిల్ 100 మిల్లీ లీటర్లు, ఇమిడాక్లోప్రిడ్ 140 గ్రాములు కలిపి ఎకరా పంటకు పిచికారీ చేయాలని తెలిపారు. చలితో నల్లతామర వస్తుందని ముందస్తుగా చేను చుట్టూ 4, 5 వరుసలు జొన్న పంటలను ఎర పంటగా వేయాలని వివరించారు. లేదా ఫెన్స్‌పై రాక్సిమేట్ 200 మిల్లీలీటర్ల మందును ఎకరాకు వారం రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలని చెప్పారు. ఎండు తెగులు నివారణకు 100 కిలోల పశువుల ఎరువులో 2 కిలోల ట్రైకోడెర్మా విరిడి, 2 కిలోల సూడామోనాస్ మందును కలిపి వారం రోజులు మగ్గాక దుక్కిలో వేసుకోవాలని పేర్కొన్నారు. పసుపు పంటలో దుంప పుచ్చు నివారణకు ఎకరాకు 3 బస్తాల వేపపిండి, 3జీ కార్బోఫ్యూరాన్ 8 కిలోలు కలిపి పసుపు కాండం దిగువ భాగంలో చల్లాలన్నారు. దుంప కుళ్లు నివారణకు రెడోమిల్ గోల్డ్ మందును లీటర్ నీటికి 2 మిల్లీ గ్రాములు కలిపి పిచికారీ చేయాలని తెలిపారు. ట్రైకోడెర్మాను పశువుల ఎరువులో కలిపి పొలంలో చల్లుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డివిజన్ ఉద్యాన అధికారి అల్లకొండ జ్యోతి, రైతులు శ్రీరామోజు ప్రభాకర్, అచ్చిరెడ్డి, కుమారస్వామి, శ్యాంసుందర్‌రెడ్డి, శ్రీనివాస్, ఏఈఓ విజయ్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.